క్లుప్తంగా

పాఠశాలల అభివృద్ధిపై దృష్టిపెట్టండి


మాట్లాడుతున్న ఎంఈఓ రామదాసు నాయక్

మార్కాపురం టౌన్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓలు బి.రామదాస్‌నాయక్, కె.శర్వాణి తెలిపారు. మంగళవారం మార్కాపురం మండల విద్యా వనరుల కేంద్రంలో జిల్లా డైట్ నుంచి వచ్చిన అబ్జర్వర్ సామా సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్ఎల్‌డీపీ శిక్షణ కార్యక్రమానికి సంబంధించి హెచ్ఎంల నుంచి ఫీడ్‌బ్యాక్ తెలుసుకున్నారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను పాఠశాల స్థాయిలో అమలుపరచాలన్నారు. స్థానిక జడ్పీ బాయ్స్ హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

గిద్దలూరు రూరల్: చిక్కుడు పంట సాగు చేసే రైతులు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలని స్థానిక ఏఓ విజయభాస్కర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. లైసెన్సు పొందిన డీలర్ల వద్దే విత్తనాలను కొనుగోలు చేయాలని, రశీదులు తప్పకుండా తీసుకోవాలని పేర్కొన్నారు. మొలక శాతం తక్కువగా వచ్చినా, పూత, కాయలు సరిగా రాకపోయినా సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకునేందుకు రశీదులు తప్పనిసరి అని స్పష్టం చేశారు. రశీదులు ఇవ్వని డీలర్లపై ఫిర్యాదు చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మార్కాపురం: మార్కాపురం మండలంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నాగేంద్రరెడ్డి తెలిపారు. మండలంలోని కోమటికుంట, కొండేపల్లి, తిప్పాయపాలెం, గజ్జలకొండ, పెద్దయాచవరం, తర్లుపాడు మండలంలోని గానుగపెంట విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మత్తులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా కేంద్రాల పరిధిలో ఉన్న గ్రామాల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నామని, సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

సమ్మర్‌ర్‌ర్...!

- వేడి గాలులతో జనం ఉక్కిరిబిక్కిరి
- చలివేంద్రాల ఏర్పాటుపై సర్కారు మౌనం
- ఈ ఏడాది అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయంటున్న వాతావరణ శాఖ
- జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారుల సూచన


మధ్యాహ్నం వేళలో నిర్మానుష్యంగా బస్టాండ్

బేస్తవారిపేట: రోజురోజుకూ ఎండలు దంచికొడుతున్నాయి. మార్చి నెలలోనే సూరీడు సుర్రుమనిపించాడు. ఏప్రిల్ మొదలైంది. మునుముందు ఎండల తీవ్రత ఎలా ఉంటోందనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ ప్రభావం కనిపిస్తోంది. మధ్యాహ్నం సమయానికి రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రమైన వేడి వాతావరణం తగ్గడం లేదు. వేడిగాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గృహాల్లో ఉన్న ఏసీలు, కూలర్లు ఉంటేగాని ఉండలేని పరిస్థితి.

కానరాని చలివేంద్రాలు

గతంలో వేసవికాలంలో ప్రభుత్వపరంగా మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకునేవారు. మండల కేంద్రంతో పాటు, రద్దీ కూడళ్లలో మంచి నీరు, మజ్జిగ అందించేందుకు చర్యలు తీసుకునేవారు. దీనికోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించేది. స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో మజ్జిగ, మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు విరివిగా ఏర్పాటయ్యేవి. ఏప్రిల్ నెల వచ్చిన ప్రభుత్వ పరంగా చలివేంద్రాల జాడలేదు. కేవలం అధికారులు ప్రకటనలకే పరిమితమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. దాహం వేస్తే మంచినీటి బాటిళ్లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి. లీటర్ నీటి కోసం రూ.20 చొప్పున వెచ్చించాల్సి వస్తోందని ప్రయాణికులు, బాటసారులు చెబుతున్నారు.

ఎండతో అనారోగ్య సమస్యలు

ఎండ దెబ్బకు గురైన వారిలో ఆకస్మికంగా వాంతులు, విరేచనాలతోపాటు తీవ్రమైన కడుపునొప్పి వస్తుంది. చలితో కూడిన జ్వరం కూడా వస్తుంది. తీవ్రమైన తలనొప్పితో బాధపడతారు. వికారంగా ఉండటం, ఆకలి లేకపోవడం లాంటి లక్షణాలు కనపిస్తాయి. కొందరికి చర్మంపై దురద వస్తుంది.

వడదెబ్బ తగలకుండా..

ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందువల్ల వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఎక్కువగా మంచినీరు, కొబ్బరినీరు, ఓఆర్ఎస్ ద్రావణం, ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ లాంటి వాటితోపాటు నీటి శాతం అధికంగా ఉండే పుచ్చకాయ తీసుకోవాలి.

- వీలైనంత వరకు ఎండలో తిరగడం తగ్గించాలి. తప్పనిసరి పరిస్థితుల్లో టోపీ, చలువ కళ్ల అద్దాలు, గొడుగు వినియోగించాలి.
- శీతల పానీయాలకు దూరంగా ఉండాలి.
- తీవ్రమైన ఎండలో బయటకు వెళ్లినప్పుడు తల తిరగడం, వాంతులు, ఇతర అనారోగ్య సమస్యలు ఎదురైతే వెంటనే దగ్గరలోని వైద్యుడిని సంప్రదించాలి.

అప్రమత్తంగా ఉండాలి



ఎండ తీవ్రత పెరుగుతుండటంతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్నారులు, వృద్ధుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. వడదెబ్బ లక్షణాలుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. వేసవి కాలంలో సాధ్యమైనంత వరకు అధికంగా మంచినీరు తాగుతూ ఉండాలి.

– డాక్టర్ పి.పృథ్వీరాజ్, పీహెచ్‌సీ వైద్యాధికారి, బేస్తవారిపేట

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ షేక్ ఖాశింబి

రాచర్ల: గ్రామాల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ షేక్.ఖాశింబి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పశువైద్యాధికారి హరిబాబు మాట్లాడుతూ.. వేసవి కాలంలో తీవ్రమైన గాలులతోపాటు ఉరుముల, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నదున మేతకు వెళ్లిన పశువులు పిడుగుపాటుకు గురికాకుండా చూసుకోవాలని చెప్పారు. పశువులకు బీమా చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఏపీవో మహాలక్ష్మి మాట్లాడుతూ.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పంచ ప్రాధాన్యతలు ప్రవేశపెట్టార న్నారు. వాటిల్లో పశువుల తొట్లు, రైతువారి కుంటలు, చెరువు కాలువలు మరమ్మతులు చేయడం, చెరువులు శుభ్రం చేయడం లాంటి పనులు మంజూరు చేశారని తెలిపారు. అనంతరం ఎంపీపీ షేక్.ఖాశింబి మాట్లాడుతూ.. వేసవికాలంలో ఎండలు మండిపోతున్నాయని దానికి తోడుగా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా మారుతోందన్నారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి, దశల వారీగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.వెంకటరామిరెడ్డి, వ్యవసాయాధికారి షేక్.అబ్దుల్ రఫీక్, ఎంఈఓ కోటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఏఈ బాలగురవయ్య, వెలుగు ఏపీఎం రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జీపు, మోటారు వర్కర్లకు పావలా వడ్డీకే రుణాలివ్వాలి


మాట్లాడుతున్న అందె నాసరయ్య

మార్కాపురం: జీపు, మోటారు వర్కర్లకు పావలా వడ్డీకే ప్రభుత్వం రుణాలు ఇచ్చి జీపులు, కార్లు కొనుగోలు చేసేందుకు సహకరించాలని జీపు, మోటారు వర్కర్ల యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంస్థ గౌరవాధ్యక్షుడు అందె నాసరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జీపుల డ్రైవర్లు చనిపోతే 10 లక్షల రూపాయల ఆర్థిక సాయం ప్రభుత్వమే చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ అమలుపరచాలని కోరారు. ప్రభుత్వమే జీపుల స్పేర్‌పార్ట్స్ షాపులను ఏర్పాటుచేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, స్పేర్ పార్ట్స్ కూడా ఆ షాపుల ద్వారానే కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్‌కె ఖాశీం, కోఆప్షన్ సభ్యులు అమీరుల్లాఖాన్, కాశయ్య, మల్లికార్జున్, వెంకటరెడ్డి, సుబ్బారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే కేపీ


లింగోజిపల్లిలో పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కేపీ


నాగులవరం ఆలయంలో..

కంభం: మండలంలోని లింగోజిపల్లి, పెద్దనల్ల కాల్వ, అర్ధవీడు మండలంలోని నాగులవరం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన శ్రీరామనవమి ఉత్సవాల్లో మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త కేపీ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కేపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో పర్యటించి పలువురు నాయకులతో మాట్లాడారు.

కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సెల్ సెక్రటరీ ఎండీ అబ్దుల్‌గఫార్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కంభం, అర్ధవీడు మండలాల అధ్యక్షులు గొంగటి చెన్నారెడ్డి, ఏరువ రంగారెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం, ఎంపీటీసీలు రఫీ, ఆనంద్, హుస్సేన్‌బాష, గురుమూర్తి, రాజు, జగన్, దండుగ వెంకటేశ్వర రెడ్డి, ఆవులయ్య, మాజీ ఎంపీపీ రవికుమార్, రాజేశ్వరరావు, ఓరుగంటి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జీవనోపాధుల ప్రణాళిక సిద్ధం చేయండి

- డీఆర్‌డీఏ పీడీ నారాయణ


కొట్టాలపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న పీడీ నారాయణ

మార్కాపురం: స్వయం సహాయక సంఘాల సభ్యుల రుణ, జీవనోపాధుల ప్రణాళిక వాస్తవ అంచనాలకు తగినట్లు ఉండేలా తయారు చేయాలని డీఆర్‌డీఏ పీడీ టి.నారాయణ అన్నారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న స్వయం సహాయక సంఘాల సభ్యుల రుణ ప్రణాళిక నమోదు ప్రక్రియలో భాగంగా మంగళవారం ఆయన మార్కాపురం, మద్దిపాడు, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు, దొనకొండ మండలాల్లో జరుగుతున్న ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మార్కాపురం కార్యాలయంలో మాట్లాడారు. గతంలో ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలతో పాటు స్త్రీనిధి నుంచి కూడా రుణ సదుపాయం అందించిందన్నారు. జీవనోపాధుల ద్వారా ఆదాయ భృతికి కావాల్సిన పెట్టుబడి రుణ ప్రణాళిక తయారు చేసుకుంటే ద్వారా అవసరమైన సమయాల్లోనే రుణాలు పొందే వీలుంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 45 వేల సంఘాల్లోని 4.50 లక్షల మంది సభ్యుల నుంచి సమాచారం సేకరించామన్నారు. ప్రతి ఒక్కరికీ అవసరమైనప్పుడు రుణం అందించేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. తీసుకున్న ప్రతి రూపాయి సద్వినియోగం అయ్యేలా చూడాలని, తప్పుడు సమాచారం నమోదు చేయవద్దని సూచించారు. అనంతరం వేములకోట పంచాయతీ కొట్టాలపల్లిలోని సంఘ సభ్యులతో మాట్లాడారు. ఆయన వెంట ఏపీఎం పిచ్చయ్య ఉన్నారు.

వైభవంగా శ్రీరాముని రథోత్సవం


ప్రత్యేక అలంకరణలో సీతారాములు


గొట్లగట్టులో రథోత్సవానికి హాజరైన భక్తులు

కొనకనమిట్ల: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గొట్లగట్టు, చినమనగుండం గ్రామాల్లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన రాములోరి రథోత్సవం కనుల పండువగా సాగింది. సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి గ్రామంలో ఊరేగించారు. ముందుగా వేదపండితులు వినుపాముల రామకృష్ణశర్మ, శేఖరశర్మ పూజలు, పుష్పాభిషేకం చేశారు. ఉభయదాతలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై రథోత్సవాన్ని తిలకించారు. జైశ్రీరామ్ నినాదాలతో గ్రామ వీధులు మారుమోగాయి. మహిళలు రథాన్ని లాగి భక్తిని చాటుకున్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. రథోత్సవం అనంతరం వసంతోత్సవం, దొంగల దోపిడీ నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ మహిళల కోలాట ప్రదర్శన, భక్తి గీతాలు భక్తులను అలరించాయి.

పాఠశాలలో వసతులు తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

కంభం: స్థానిక పార్కు వీధిలోని ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈఓ శ్రీనివాసులు తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులు, సౌకర్యాలు, రాతపుస్తకాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. దాతల సహకారంతో నాణ్యమైన ఆహారం వడ్డించడం అభినందనీయమన్నారు. హెచ్ఎం రహమత్, సీఆర్పీ మురళి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ భూముల పరిశీలన


భూములు పరిశీలిస్తున్న జేసీ, అధికారులు

పొదిలి: నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్ భూములను జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మంగళవారం పరిశీలించారు. పొదిలి రెవెన్యూకు సంబంధించి సర్వే నంబర్ 1059–2ఏ, 1067–2ఎఫ్2, 1067–3లలోని భూములను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సంబంధిత రికార్డులు తనిఖీ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు భూములను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. ఆయన వెంట కనిగిరి ఆర్‌డీఓ కేశవర్ధన్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్ తదితరులు ఉన్నారు.

కంభం చౌక్ సెంటర్.. ట్రాఫికర్!


చౌక్‌సెంటర్‌లో ట్రాఫిక్ కారణంగా నిలిచిన స్కూల్ బస్సు


సత్యసాయి ఆలయం సమీపంలో ముందుకు వెళ్లే దారిలేక ఆగిన వాహనాలు

కంభం: పట్టణంలోని చౌక్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జటిలమవుతోంది. కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి అర్ధవీడు రోడ్డు మలుపు వరకు సుమారు 30 అడుగుల వెడల్పుతో విశాలంగా ఉన్న రోడ్డు అక్కడి నుంచి కుంచించుకుపోతూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు వచ్చేసరికి 10 నుంచి 15 అడుగులు మిగిలింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రోడ్డుకు ఇరువైపులా వస్త్ర దుకాణాలు, సైకిల్‌షాపులు, గోల్డ్ షాపులు, మెడికల్ షాపులు, ఇతర దుకాణాలు ఉన్నాయి. షాపులకు సంబంధించిన వస్తువులు రోడ్లపైకి ఉంచడం, ఎదురుగా ద్విచక్రవాహనాలు ఆపుతుండటంతో వాహనాల రాకపోకలకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. స్కూల్ బస్సులు, ఇతర పెద్ద వాహనాలు ఏవైనా వస్తే ముందుకు వెళ్లలేని పరిస్థితి. చౌక్ సెంటర్లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వాహనదారులకు కౌన్సెలింగ్

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన పలువురు వాహనదారులకు ట్రాఫిక్ ఎస్సై అహరోన్ కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు జరిమానా విధించారు. టూవీలర్ నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తలిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్సై అహరోన్

కోర్టువారి ఉత్తర్వుల మేరకు

వేలం ప్రకటన

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

ఇ.పి.నెం. 92/2013 ఇన్ ఓ.యస్. నెం : 42/2013

షలిదోలా హరినాథ్ ... డిహెచ్ఆర్. / ప్లెంటిఫ్

VS

బొల్లాని మధు సూధనరావు ... జెడిఆర్ / డిఫెండెంట్

To, బొల్లాని మధు సూధనరావు, టీచర్
S/o పద్మనాభయ్య
Old, ING. Vysa Bank Road,
Giddalur, Post & Mandal
Prkasam Dist, జెడిఆర్ / డిఫెండెంట్

కోర్టువారి ఉత్తరుల ప్రకారం క్రింది తెలిపిన షెడ్యూలు ఆస్తిని మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో తేది : 29-04-2025న ఉదయం 10:30గంటలకు వేలం వేయుటకు పేపరు ప్రకటన ద్వారా తెలియజేయుచున్నారు. కావున ఆసక్తి కలిగిన వారు వేలం పాటలో పాల్గొని కోర్టువారి షరతులకు లోబడి వేలం పాటలోని హెచ్చుపాట ధరకు 1/4 వంతు చెల్లించి క్రింది షెడ్యూలు ఆస్తిని సొంతం చేసుకొనుటకు మిగిలిన సైకం కోర్టు వారు నిర్ణయించిన తేది నాటికి చెల్లించి కోర్టు ద్వారా రిజిస్టర్ పొందవచ్చునని తెలియజేయడమైనది.

షెడ్యూలు ఆస్తి వివరాలు : ప్రకాశం జిల్లా మార్కాపురం డిస్ట్రిక్ రిజిస్టర్ ఆఫీసు గిద్దలూరు సబ్ రిజిస్టర్ ఆఫీసు షెడ్యూలు ఆస్తి గిద్దలూరు గ్రామ పంచాయితీలో ఉన్నది. డోర్ నెంబర్ : 7-15-79 పాతబడిపోయిన మిద్దె, **హద్దులు : తూర్పు :** రస్తా (ఓల్డ్ వైశ్యాబ్యాంక్ రోడ్డు) **దక్షిణం :** రోడ్డు, **పడమర :** చిన్న రోడ్డు, **ఉత్తరం :** దీతిరాల మధుసూధన్‌రావు ఇల్లు

ఇందుకు హద్దులకు లోనైన 64.5 చదరపు గజాల స్థలంలోని పాతబడిపోయిన మిద్దె.

అమీనా వాల్యు : 40,00,000/-
డి.హెచ్.ఆర్.వాల్యు : 4,00,000/-
మార్కెట్ వాల్యు : 3,87,000/-
స్థలం : మార్కాపురం
తేది: 08-4-2025

ఇట్లు
నామ సుబ్బారావు, ఎం.ఎ.బి.ఎల్
డిహెచ్ఆర్ తరుపు న్యాయవాది
మార్కాపురం, ప్రకాశం జిల్లా. 9441067352

అధ్వానంగా వెంకటాపురం రోడ్డు



గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటాపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు గోతులమయంగా మారింది. వాహనాల రాకపోకల సమయంలో గ్రామస్తులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ గ్రామ ప్రజలు వ్యక్తిగత పనులపై నిత్యం గిద్దలూరు పట్టణానికి వచ్చి వెళ్తుంటారు. అయితే రహదారి మధ్యలో భారీ గుంతలు ఏర్పడి, కంకర రాళ్లు పైకి తేలి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. కేఎస్ పల్లె నుంచి కంచిపల్లె మీదుగా వెంకటాపురం గ్రామానికి 4 కిలోమీటర్ల మేర తారురోడ్డు ఉంది. కేఎస్ పల్లె–కంచిపల్లె మధ్య ఉన్న చప్టా వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి. కొంతమేర రోడ్డు కొట్టుకుపోయింది. కంచిపల్లె నుంచి నుంచి వెంకటాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు సైతం గోతులమయమైంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని, రహదారికి ఇరువైపులా చిల్లచెట్లు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.




రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గుంతలు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com